

ఇంటినుంచే తపాలా సేవలు
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల పోస్టల్ సర్వీసులు తపాలా వినియోగదారులు ఇంటినుంచే పొందవచ్చు.
- 8లో▸



పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి
- 9లో▸
ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు.

గరిష్టం/కనిష్టం
28.3^0 / 24.2^0
వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు మేరుగు భావనరుషీ (90) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. భావనరుషీ భౌతికాయానికి గ్రామస్తులు నివాళ్లర్పించారు.

అర్చకులకు నియామక ఉత్తర్వులు



కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం అర్చకులుగా ఎంపికైన సంగనభట్ల విజయ్‌కుమార్, రావుల రాజకుమార్, త్రిపురారి శ్రావణ్‌కుమార్, కాకిరాల పవన్‌శర్మలకు ప్రధానార్చకులు పనకంటి ఫణీంద్రశర్మతో కలిసి ఆలయ ఈఓ మహేష్ సోమవారం నియామక పత్రాలను అందించారు. మరో అర్చకుడు కశ్యప్‌శర్మపై పలు అభియోగాలు రావడంతో ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు తెలిపారు. సోమవారం నలుగురు విధుల్లో చేరినట్లు తెలిపారు.

మున్సిపల్ ఎదుట ధర్నా




భూపాలపల్లి అర్బన్: 25వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలో మిషన్ భగీరథ నీరు మురికిగా వస్తుందన్నారు. కాలనీలో రోడ్లు సరిగ్గా లేవని, సైడ్‌కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని చెప్పారు. కాలనీ సమస్యలపై కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, జోసఫ్, కాలనీ వాసులు రజిత, సంధ్య, స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



భూపాలపల్లి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లాకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డీవైఎస్‌ఓ రఘు తెలిపారు. విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, వైద్యాధికారులు ఉమాదేవి, రోహిణి, నిహారిక, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జంగేడు హైస్కూల్‌లో వనమహోత్సవం



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సింగరేణి అధికారులు వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో విశాలమైన స్థలం ఉన్నందున పాఠశాలను సింగరేణి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆట స్థలం చదును చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పోషమల్లు, శ్రావణ్‌కుమార్, రాహుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు చేయట్లే..



జిల్లా ఆస్పత్రిలో అందని సేవలు
- స్కానింగ్, ఎక్స్‌రేలకూ తప్పని తిప్పలు
- ఆధునిక యంత్రాలున్నా పట్టించుకోవట్లే..
- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులు
- పట్టించుకోని వైద్యులు



రక్తం ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న బాధితులు

భూపాలపల్లి అర్బన్: వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వస్తున్న రోగులకు రక్త, స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షలు చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఆస్పత్రిలో మైక్రోలజీ, పాథాలజీ, స్కానింగ్, ఎక్స్–రే ఆధునాతన పరికరాలు ఉన్నప్పటికీ వినియోగించడంలో విఫలమవుతున్నారు. పూర్తిస్థాయిలో సేవలు అందకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో పరీక్షల కోసం రోగులు ప్రైవేట్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. ఇదంతా చూస్తున్నా.. వైద్యాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

రక్త పరీక్షలు టీ హబ్‌కే..
గత ప్రభుత్వం టీ–డయాగ్నొస్టిక్స్ సెంటర్(టీ–హబ్) ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలలో అన్ని రకాల రక్త పరీక్షలు, ఎక్స్–రే, ఈసీజీ, యూఎస్‌జీ, మమో, టీఫా స్కానింగ్‌లు అందుబాటులో లేవు. అక్కడ ఆస్పత్రులకు వచ్చిన బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే టెస్టుల కోసం రక్తాన్ని సేకరించి, స్కానింగ్‌కు బాధితులను టీ–హబ్‌కు పంపిస్తారు. 24గంటల తరువాత రిపోర్టు వస్తుంది. ఈ హబ్‌లో 57 రకాల పరీక్షలు చేస్తారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోకి పరీక్షలకు ఆధునిక యంత్రాలు ఉన్నప్పటికీ రోగుల నుంచి అవసరమైన వారి రక్తాన్ని సేకరించి ప్రతి రక్త పరీక్షకు టీ–హబ్‌కు పంపిస్తున్నారు. అక్కడ వారికి అందుబాటులో లేని రక్త పరీక్షలకు మాత్రమే టీ–హబ్‌కు పంపించాల్సి ఉండగా రెండు మూడు గంటల్లో ఆస్పత్రిలో పరీక్షలు చేసి రిపోర్టు ఇచ్చే సౌకర్యాలు ఉన్నప్పటికీ పరీక్షలు చేయడం లేదు.

స్కానింగ్‌లకు రెండు మూడు రోజులు
కడుపు, నడుము, మూత్రపిండాలు, గర్భిణులకు అబ్డమిన్, అల్ట్రా స్కానింగ్‌ల కోసం రోగులు, గర్భిణులు రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తుంది. టీ–హబ్‌లో అల్ట్రా స్కానింగ్ చేసే రేడియాలజిస్టు ప్రతిరోజు ఉదయం 9గంటల గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా రోజులో ఒక గంట పాటు కూడా విధులు నిర్వర్తించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేడియాలజిస్టు వచ్చిన సమయంలో స్కానింగ్ కోసం వేచి ఉన్న వారికి మాత్రమే స్కానింగ్ చేసి వెళ్లిపోతున్నాడు. ఆస్పత్రిలో అబ్డమిన్ స్కానింగ్ చేసే రేడియాలజిస్టు ప్రతి రోజు 20 మందికి మాత్రమే స్కానింగ్ చేస్తున్నారని తెలుస్తోంది. ఉదయం 9గంటలకు రావాల్సిన రేడియాలజిస్టు సమయానికి రాకపోవడం కాకుండా సమయపాలన పాటించకుండా మధ్యాహ్నం ఒంటి గంట వరకే విధుల్లో ఉంటున్నట్లు సమాచారం.

తిరగాల్సిందే..
జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి అనారోగ్య బారిన పడి ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుంటే వారి రిపోర్టులు రావాలంటే రెండు మూడు రోజులు తిరగాల్సి వస్తుంది. ఒక రోజు వైద్య పరీక్షలు చేసుకొని రక్తం పరీక్షలకు ఇవ్వడం, రిపోర్ట్ కోసం మరుసటి రోజు రావడం, ఆ రోజు రిపోర్టు రాకపోతే మరో రోజు వచ్చి తీసుకొని డాక్టర్‌కు చూపించాల్సిన దుస్థితి నెలకొంది. సమయపాలన పాటించకుండా రోజుకు కొంత టార్గెట్ పెట్టుకొని స్కానింగ్‌లు చేయడం వలన జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రెండు మూడు రోజులు తిరగాల్సి ఉందని, ఉదయం ఏడు గంటలకే వచ్చే ముందు ఉండాలని వేచిచూస్తున్నారు.



రక్త నమూనాల సేకరణ గది

వినియోగంలోకి తీసుకువస్తాం..



ఆస్పత్రిలో ఉన్నటువంటి అన్ని రకాల సౌకర్యాలను వినియోగంలోకి తీసుకువస్తాం. తప్పని పరిస్థితుల్లో టీ–హబ్‌కు పంపిస్తున్నాం. స్కానింగ్ రేడియాలజిస్టులు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్

మట్టి గణపతులను పూజించాలి



కలెక్టరేట్‌కు వచ్చిన వారికి మట్టి గణపతి విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ



పోస్టాఫీసు సిబ్బందికి పరికరాలు అందిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

- సంక్షేమ హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్న మట్టి గణపతులు, మట్టి పతులు పూజించాలన్న వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్ నాయక్ పాల్గొన్నారు.

భద్రతా చర్యలు చేపట్టాలి..
వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నవరాత్రుల అనంతరం నిమజ్జనాల వరకు అంతరాయం కలగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం రోజున అత్యవసర వైద్య కేంద్రాల ఏర్పాటుతో పాటు మహదేవపూర్, జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నా రు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, క్రేన్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో పటిష్ట పర్యవేక్షణ..
వసతి గృహాల విద్యార్థుల సంక్షేమం, ఆహార నాణ్యత పరిశీలనకు ప్రత్యేక, పోలీస్, క్లస్టర్ అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో మెనూ పాయించకపోయినా, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలకు సిఫారసు చేయాలని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి..
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 53 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

నిరంతర కృషితోనే జిల్లాకు గౌరవం..
కేటాయించిన లక్ష్య సాధనకు కృషి చేయడం ద్వారానే మన జిల్లాకు గౌరవం లభించిందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వెనుకబడిన జిల్లాల ప్రగతికి నీతి ఆయోగ్ ప్రకటించిన యాస్పిరేషన్ బ్లాక్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన సందర్భంగా అధికారులు, సిబ్బందికి అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు.

ముఖ గుర్తింపు ద్వారా పింఛన్
భూపాలపల్లి రూరల్: జిల్లాలోని పింఛన్‌దారులు ఇకపై బయోమెట్రిక్ ఆధారిత ఇబ్బందులు లేకుండా, తాము ఎక్కడ ఉన్నా సులభంగా ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పోస్టు మాస్టర్లకు పింఛను ఇవ్వడానికి అవసరమైన 89 ముఖ గుర్తింపు పరికరాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఆర్డీఓ రవి పాల్గొన్నారు.

యూరియా టోకెన్ కోసం లైన్‌లో నిల్చున్న రైతులు, లైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు





యూరియా తిప్పలు..

మల్హర్ మండలం తాడిచర్ల పీఏసీఎస్‌కు ఆదివారం రాత్రి 444 బస్తాల యూరియా వచ్చింది. దీంతో సోమవారం ఉదయం రైతులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండడంతో గంటల తరబడి నిల్చోలేక చెప్పులను లైన్లలో పెట్టారు. కొయ్యూరు పోలీసులు పంపిణీ కేంద్రం వద్దకు చేరుకుని లైన్‌లోని ఒక్కొక్కరికి టోకెన్ అందించారు. సిబ్బంది ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా అందించారు. గంటల తరబడి ఉంటే ఒక బస్తా యూరియా ఇచ్చారని.. దేనికి సరిపోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

– మల్హర్

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి

సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న జిల్లా డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం వెంటనే ప్రకటించాలని, ఐదు నెలల కమీషన్లు, పాత బకాయిలను విడుదల చేయాలని కోరుతూ జిల్లా రేషన్ డీలర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లస్వామి గౌడ్, కార్యదర్శి నిమ్మల భద్రయ్య మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినటువంటి రూ.5వేల గౌరవ వేతనం, రూ.300 కమీషన్‌ను పెంచాలని వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం ఇచ్చామన్నారు. సెప్టెంబర్ 5వ తేదీలోపు 5నెలల కమీషన్ చెల్లించాలని, డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేదంటే రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న రాష్ట్ర బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

నోటిఫికేషనే తరువాయి..

స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధం
- సెప్టెంబర్ మొదటి వారంలో ప్రకటించే అవకాశం
- 'స్థానిక'ంలో బీసీలకు 42 శాతం అవకాశం.. పార్టీ కేడర్‌కు కాంగ్రెస్ సంకేతాలు
- ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ.. ఆ తర్వాతే సర్పంచ్, 'ప్యాక్స్'ల ఎన్నికలు
- ఉమ్మడి జిల్లాలో 6 జెడ్పీలు, 75 జెడ్పీటీసీ స్థానాలు..
- కలెక్టర్‌లకు సీఎస్ సమాచారం..

సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి వేళయ్యిందా..? రిజర్వేషన్‌లు తేలకున్నా ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు సిద్ధమవుతోందా..? ఈ మేరకు పార్టీ కేడర్, నాయకులకు సంకేతాలు అందాయా..? పీఏసీలో తీసుకున్న నిర్ణయం మేరకు సెప్టెంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడనుందా?.. జిల్లా ఉన్నతాధికారులను కూడా అప్రమత్తం చేశారా?... అంటే నిజమే అంటున్నాయి అధికార పార్టీ, అధికార వర్గాలు. నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సోమవారం కలెక్టర్‌లకు మౌఖిక ఆదేశాలు అందాయన్న ప్రచారం జరుగుతోంది.

రాజకీయ పార్టీల్లో మొదలైన సందడి...
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. మొదట పేర్కొన్న విధంగానే ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీపీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ వస్తే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో ఆరు జిల్లా ప్రజాపరిషత్‌లు, 75 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 778 ఎంపీటీసీ స్థానాలు 75 ఎంపీపీ స్థానాలను ప్రకటించి ఆ మేరకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులకు ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలు జరిపే విధంగా 15,021 పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు అధికారులు ఇది వరకే ప్రకటించారు. ఈ నెల 29న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జరిగే కీలక నిర్ణయాలను బట్టి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండగా.. రాజకీయ పార్టీల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల సందడి పెరిగింది. సెప్టెంబర్ మాసంలో ఎన్నికలు ఖాయమన్న ప్రచారం నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటినుంచే సై అంటున్నారు. ఆయా పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలను కలిసి తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.



సెప్టెంబర్‌లోనే నోటిఫికేషన్..?..
ఈ దిశగానే కసరత్తు...
ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసి దాదాపుగా రెండేళ్లు కావస్తోంది. దీనిపై ఇదివరకే ఈ సెప్టెంబర్ నెలాఖరులోగా ఎన్నికలు జరిపించాలన్న హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికార పార్టీ నేతలు, సీఎం నిర్ణయించినట్లు ప్రచారం. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశం ఎటూ తేలకపోయినప్పటికీ.. పార్టీ పరంగా ఆ మేరకు అవకాశం కల్పించే యోచనలో అధిష్టానం ఉన్నట్లు ఆ పార్టీ ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు చెబుతున్నారు. ఈ నెల 29న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలపై చర్చించి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడినా.. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, చీఫ్ సెక్రటరీల నుంచి ఆదేశాలు అందడంతో అందరూ అలర్ట్ అయ్యారు.

ఉమ్మడి వరంగల్‌లో ఇలా..

జిల్లా	జెడ్పీపీ	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	ఎంపీటీసీలు	సర్పంచ్	వార్డులు	పోలింగ్ కేంద్రాలు
హనుమకొండ	1	12	12	129	210	1,986	1,986
వరంగల్	1	11	11	130	317	2,754	2,754
జేఎస్‌భూపాలపల్లి	1	12	12	109	248	2,102	2,102
మహబూబాబాద్	1	18	18	193	482	4,110	4,110
ములుగు	1	10	10	83	171	1,520	1,535
జనగామ	1	12	12	134	280	2,534	2,534
	06	75	75	778	1,708	15,006	15,021

పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు




జనహిత పాదయాత్ర

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పరిధి ఇల్లంద మార్కెట్ నుంచి మండలకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్ర నిర్వహించారు. వారి వెంట మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు, పార్టీ శ్రేణులు నడిచారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ముఖ్యనేతలు ప్రసంగించారు. – సాక్షి, వరంగల్

– వివరాలు 8లో▸

విద్యార్థులను పరామర్శించిన జడ్జిలు



విద్యార్థులను పరామర్శిస్తున్న జడ్జిలు

భూపాలపల్లి అర్బన్: విషతుల్యమైన నీటిని తాగి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్ దిలీప్‌కుమార్‌నాయక్ పరామర్శించారు. చిన్నారులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. డ్యూటీ డాక్టర్లతో మాట్లాడి పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం మెరుగుపడేలా మంచి చికిత్స అందించాలని సూచించారు. అనంతరం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లి అక్కడి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. పాఠశాలలో ఉన్నటువంటి పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

CHRISTU JYOTHI
INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
(A CATHOLIC CHRISTIAN MINORITY INSTITUTION)
(APPROVED BY AICTE & AFFILIATED TO JNTUH) website: www.cjits.ac.in
ESTD: 1998
EAMCET CODE: CJIT
Colombonagar, Yeshwanthapuram, JANGAON (Mdl. & Dist.)-506167
SPOT ADMISSIONS FOR B.TECH I YEAR TGEAPCET-2025
The students TGEAPCET-2025 qualified or not qualified and not taken admission in to anywhere are informed to attend for spot admission on 26-08-2025 at 11.00 AM with all original certificates, 4 photos and necessary fees. The seats will be filled as per guidelines prescribed by Convenor TGEAPCET-2025.
Courses offered : CSE, CSM, ECE, EEE
Hostel facility is availabel for Boy & Girls
Contact : 9866348580 & 9346474916
Few Management seats are available in B.Tech 1st Year.
Date: 26-08-2025
FR. D. VIJAYA PAUL REDDY
Director / Correspondent

క్లుప్తంగా

సెల్‌ఫోన్ చోరీ చేసిన ఇద్దరి అరెస్ట్..

● నిందితుల్లో కానిస్టేబుల్



డోర్నకల్: రైలులో సెల్‌ఫోన్ చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం జీఆర్పీ సీఐ ఎస్. అంజలి, డోర్నకల్ ఎస్సై సురేశ్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని మణికొండ ప్రాంతానికి చెందిన బండి ప్రియాంక సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్తోంది. ఈ క్రమంలో రైలు డోర్నకల్ చేరుకుంటున్న సమయంలో తన ఐఫోన్ చోరీకి గురి కావడంతో డోర్నకల్ జీఆర్పీ స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందులో రాచకొండ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ యరవండి రవీందర్‌తోపాటు అతడి బావమరిది మేకల నాగసాయిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులు జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

● పెద్దతండాలో ఘటన



రవి (ఫైల్)

సంగెం: వ్యవసాయ పనులకు వెళ్లే విషయంలో దంపతుల మధ్య తలెత్తిన ఘర్షణతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలం పెద్దతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ రవి(45), వినోద దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ పనులకు వెళ్లే విషయంలో ఆదివారం ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీనిపై మనస్తాపం చెందిన రవి.. సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన భార్య వినోద 108లో హుటాహుటిన ఎంజీఎం తరలించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి



చక్ర(ఫైల్)

కొత్తగూడ: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని పోలారంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ చక్ర(44) తన పత్తి చేనులో నీరు పారిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

WANTED
Salary: 10,000/- +T.A, D.A
మన సంస్కృతి
Cell: 73960 49947

ఇంటినుంచే తపాలా సేవలు

పోస్టల్ సర్వీసులకు కొత్త సాఫ్ట్‌వేర్
● సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం
● స్వీయ–సేవ పోర్టల్ వెబ్ ఆధారిత బుకింగ్ సౌకర్యాలు
● 1 నుంచి రిజిస్టర్డ్ పోస్టుకు మంగళం.. స్పీడ్‌పోస్ట్‌లో విలీనం





వరంగల్ హెడ్ పోస్టాఫీస్

ఖిలా వరంగల్ : ఆన్‌లైన్ సౌకర్యం లేని కాలంలో తపాలా శాఖ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించింది.. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ కాల్ లెటర్ రావాలన్నా.. ఉద్యోగం వచ్చిందన్న సమాచారం తెలుసుకోవాలన్నా.. బంధుమిత్రులకు వర్తమానం, సంస్థలు, కార్యాలయాలకు ముఖ్యమైన ధ్రువీకరణ పత్రాలు పంపాలన్నా.. ఒకప్పుడు పోస్టల్ సేవలు ప్రధాన ఆధారం. ప్రస్తుతం వినియోగదారుడు ఉన్న చోటు నుంచే తపాలా సేవలు పొందేలా అధునాతన సౌకర్యాలు కల్పించింది. ఇటీవల తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌తో సాంకేతిక అనుసంధానం చేసి దేశీయ, విదేశీయ లెటర్లు, పార్సల్ బుకింగ్, స్పీడ్ పోస్ట్ అన్నీ స్వీయ–సేవ పోర్టల్ వెబ్ ఆధారంగా పోస్టాఫీసుకు వెళ్లకుండానే ఇంటి నుంచే సులభంగా తపాలా సేవలు పొందవచ్చు.

india post.gov.in /customer&eltservice/ login యూజర్ ఐడీ, మొబైల్ ఓటీపీ, కస్టమర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లెటర్లు, పార్సిల్స్, స్పీడ్ పోస్టులు అన్ని ఇంటి వద్దే పొందొచ్చు. ఆన్‌లైన్ బుకింగ్ చేయగానే పోస్ట్‌మెన్ వినియోగదారుల ఇంటికి చేరుకుని స్పీడ్‌పోస్ట్ సేవలు, పార్సిల్స్ సేకరించి ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానంతో గమ్యానికి చేరవేయనున్నారు.

సేవలన్నీ ఒకే గొడుగు కిందికి..

తపాలా కార్యాలయాల ద్వారా అందించే సేవలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. నూతన ఐటీ 2.0 పేరుతో కొత్త సాఫ్ట్‌వేర్‌తో డేటా భద్రతతోపాటు సిస్టమ్ స్పీడ్ సామర్థ్యం పెంచారు. వరంగల్ డివిజన్ ప్రధాన కార్యాలయ పరిధిలో వరంగల్, మహబూబాబాద్ హెడ్ పోస్టాఫీసులు ఉండగా.. 42 సబ్ పోస్టాఫీసులు, 362 గ్రామీణ పోస్టాఫీసులు ద్వారా వినియోగదారులు తపాలా సేవలు పొందుతున్నారు.

కాలానుగుణంగా మార్పులు..

మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ కూడా మారుతోంది. ప్రైవేట్ సంస్థలకు దీటుగా ఇప్పటికే ఎన్నో సేవలతో అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోస్టల్ శాఖ అంతే వేగంగా స్పీడ్ పోస్ట్ విధానానికి శ్రీకారం చుడుతోంది. బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను స్పీడ్ పోస్ట్‌లో కలుపుతున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది.

రిజిస్టర్డ్ పోస్ట్ స్పీడ్ పోస్ట్‌లో విలీనం..!

స్మార్ట్ ఫోన్లు, ఆన్‌లైన్ సౌకర్యాలు లేని రోజుల్లో రిజిస్టర్డ్ పోస్ట్ ప్రజల జీవితాలతో విడదీయరాని బంధాన్ని ఏర్పర్చుకుంది. ముఖ్యమైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి ఇదే ప్రధాన మార్గంగా నిలిచింది. అయితే సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు నిలిపి వేస్తున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది. స్పీడ్ పోస్ట్‌లోకి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను విలీనం చేసి.. ఇంకా మెరుగైన సేవలు అందించనున్నది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తాం..



అధునాతన పరిజ్ఞానంతో ఖాతాదారులకు ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. ప్రైవేట్‌కు దీటుగా సేవలు అందించాలన్న లక్ష్యంతో నూతన విధానం అమల్లోకి తెస్తున్నాం. 1వ తేదీనుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలన్నీ స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేసి ఆన్‌లైన్ ట్రాకింగ్ ద్వారా సేవలు అందిస్తాం. ప్రజలు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ బుకింగ్ చేసిన ప్రతీ సేవను పది నిమిషాల వ్యవధిలో పోస్ట్‌మన్ మీ ఇంటికి చేరుకొని సేవలు అందిస్తారు. ఖాతాదారులు తమ ఇంటివద్ద తపాలా సేవలన్నీ పొందేలా చర్యలు తీసుకున్నాం. **– రవికుమార్, తపాలాశాఖ, డివిజనల్ సూపరింటెండెంట్, వరంగల్**

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతోపాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

మరో పెళ్లికి అడ్డుగా ఉందని..

భార్యను చంపిన భర్త
● నిందితుడి అరెస్ట్
● వివరాలు వెల్లడించిన వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్రాలే



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

రామన్నపేట : మరో పెళ్లికి అడ్డుగా ఉందనే కారణంతో భర్త.. భార్యను చంపాడు. నిద్రిస్తున్న సమయంలో ఆమె ముఖంపై బెడ్‌షీట్ కప్పి ఊపిరాడకుండా చేసి కిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటన వరంగల్ మట్టెవాడ పీఎస్ పరిధిలోని హంటర్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకోగా, ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు ఛేదించి నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్రాలే వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం దిర్శనపల్లి గ్రామానికి చెందిన బాదావత్ అశోక్ కూతురు గౌతమి(22)కి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్యా తండాకు చెందిన బానోత్ గణేశ్‌తో ఈ ఏడాది మేలో వివాహం జరిగింది. గణేశ్‌కు కట్నకానుకల కింద రూ.2.5 లక్షల నగదు, రెండు తులాల బంగారంతోపాటు 150 గజాల స్థలాన్ని త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చి వివాహం జరిపించారు. గణేశ్ ఆటో నడుపుకుంటూ హంటర్ రోడ్డులోని పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో అద్దెకుంటున్నాడు. పెళ్లి అనంతరం నెల రోజుల వరకు బాగానే ఉన్న గణేశ్.. ఆటో నడుపుకోవడానికి అదనపు కట్నం కావాలని భార్య గౌతమిని వేధించసాగాడు. దీంతో గౌతమి తండ్రి అశోక్ రూ.లక్ష ఇవ్వగా గణేశ్ ఆ డబ్బుతో ఆటో కొనుగోలు చేశాడు. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో మరోసారి డబ్బులు సరిపోవడం లేదంటూ గౌతమిని ఇబ్బందులకు గురిచేయడంతో మళ్లీ రూ.లక్ష ఇవ్వగా ఆ డబ్బులతో మేకలు కొనుగోలు చేసి స్వగ్రామంలో తండ్రికి అప్పగించాడు. అప్పటి కూడా భార్యతో సక్రమంగా ఉండడం లేదు. ఈ క్రమంలో తనతో కలిసి పదో తరగతి చదువుకున్న అంజలి అనే యువతితో పరిచయం పెరిగింది. దీంతో ఆమెను పెళ్లి చేసుకోవాలని భావించి తనకు అడ్డుగా ఉన్న భార్య గౌతమిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి భార్య నిద్రిస్తున్న క్రమంలో ఆమె ముఖంపై బెడ్‌షీట్ బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపాడు. అనంతరం ఏమీ తెలియనట్లు నటిస్తూ గౌతమి పిలిచినా పలకడం లేదని తన ఇంటి పక్కన ఉంటున్న పెద్దమ్మ కొడుకు కుమార్‌కు చెప్పాడు. కుమార్ దంపతులు వచ్చి చూసి గౌతమిని 108లో ఎంజీఎం తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటన తర్వాత నిందితుడు తప్పించుకుని తిరుగుతున్న క్రమంలో సోమవారం వరంగల్ చౌరస్తా వద్ద పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు 24 గంటల్లో కేసు ఛేదించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సై శివకృష్ణ, సిబ్బంది ఏఎస్పీ అభినందించారు.

కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలి

● సెప్టెంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల కమీషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సెప్టెంబర్ 5న బంద్ పాటించనున్నట్లు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5 వేలు, కమీషన్ పెంపు, ఏ నెల కమీషన్ ఆ నెలలోనే చెల్లించాలని కోరారు. అలాగే, రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాస్, రవీందర్, వెంకటేష్, రాము, మోహన్, నాయకులు నర్సయ్య, భానుచందర్, దామోదర్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి దుర్మరణం

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ పశువుల కాపరి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మల్లంపల్లి మండలం శ్రీనగర్ జీపీ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీనగర్‌కు చెందిన ధారావత్ భిక్షపతి(40) అదే గ్రామానికి చెందిన టీక్యానాయక్ వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి చేర్చాడు. ఒక గేదె రాకపోవడంతో వెతకడానికి యజమాని టీక్యానాయక్.. భిక్షపతిని తీసుకెళ్లాడు. గేదె కనిపించిన అనంతరం తోలుకొని రావాలని చెప్పి బైక్‌పై వెళ్లాడు. గేదెను తోలుకొని వస్తున్న క్రమంలో మల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో హనుమకొండ వైపునకు వెళ్తున్న గూడ్స్ వాహనం ఢీకొనడంతో భిక్షపతి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

దొంగ అరెస్ట్, రిమాండ్

● రూ.5.50లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



గోపి అరెస్ట్ చూపుతున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్

ఖిలా వరంగల్: దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన 56.083 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి. సురేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వల్లపు గోపి(29) వరంగల్ ప్లాట్ ఫామ్‌పై సోమవారం అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో జీఆర్పీ పోలీసులు తనిఖీ చేయగా.. రూ.5.50 లక్షల విలువైన 56.083 గ్రాముల బంగారం లభ్యమైంది. అనంతరం విచారించగా ఇటీవల నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వద్ద చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది రాము, రియాజోద్దీన్, నాగరాజు, ఏఎస్సై రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నౌవేరా షేక్‌కు రిమాండ్

వరంగల్ లీగల్: హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ (ఎం/ఎస్ హీరా గోల్డ్ ఎగ్జిమ్ లిమిటెడ్) సీఈఓ నౌవేరా షేక్‌పై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కాగా సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి జిల్లా ప్రధాన న్యాయస్థానం ఎదుట హాజరుపర్చారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి నిర్మలా గీతాంబ ఆదేశాలు జారీ చేశారు. హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈఓ నౌవేరా షేక్ వరంగల్ చార్‌బౌలి ప్రాంతానికి చెందిన షాహెద్ పర్వీజ్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులను ప్రలోభ పెట్టి పెద్ద మొత్తంలో బంగారంపై పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో వడ్డీ, లాభాలు అందిస్తామని తెలపడంతో ముగ్గురు బాధితులు రూ.33 లక్షలు చెల్లించారు. పెట్టుబడి అనంతరం వారికి సుమారు రూ.32వేలు మాత్రమే కంపెనీనుంచి రాగా విచారణలో మోసపోయామని నిర్ధారించుకొని 2021, జనవరి 14న బాధితుడు షాహెద్ పర్వీజ్ చేసిన ఫిర్యాదు మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 2021లో నౌవేరా షేక్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతీ ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని, అలాగే ప్రతీ కోర్టు వాయిదాకు హాజరుకావాలని న్యాయమూర్తి షరతులు విధించారు. పలు వాయిదాలకు నిందితురాలు నౌవేరా షేక్ హాజరు కాకపోవడంతో జిల్లా కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ వారెంట్ మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులు నిందితురాలిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా సెప్టెంబర్ 8 తేదీ (14 రోజుల) వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

కాంగ్రెస్ ఖిల్లా.. వరంగల్ జిల్లా

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలిచి ఇక్కడే విజయోత్సవ సభ

● చెప్పి మరీ వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యే సీట్లు గెలిచాం
● జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పక్కన మీనాక్షి నటరాజన్, ఎంపీ బలరాంనాయక్, మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

సాక్షి, వరంగల్: కాంగ్రెస్ ఖిల్లా.. వరంగల్ జిల్లా అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు జరిగిన పాదయాత్రలో వర్ధన్నపేట శాసనసభ్యుడు అరూరి రమేష్, గొప్ప నాయకుడు అని చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడిస్తామని చెప్పి మరీ ఆ సీట్లు కైవసం చేసుకున్నామన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం నుంచి వర్ధన్నపేట టౌన్ అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం రాత్రి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా అంటేనే రాజకీయాలకు అడ్డా అన్నారు. మరో మూడేళ్ల పాలన ప్రజలతో శభాష్ అనిపించుకొని 100 సీట్లతో అధికారంలోకి వచ్చాక ఇదే వర్ధన్నపేటలో విజయోత్సవ సభ చేస్తామని అన్నారు. మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ...'ఓటు చోరీ బీజేపీ... ల్యాండ్ చోరీ బీఆర్ఎస్ పార్టీలను బ్యాలెట్ మీద బొంద పెట్టాలి. ఆ రెండు పార్టీలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పాతాళం లోతుకి పాతి పెట్టాలి. యూరియా మీద రెండు పార్టీలు దొంగ రాజకీయం చేస్తున్నాయి' అని మండిపడ్డారు. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రాజేందర్ రెడ్డి, రాంచందర్ నాయక్, మురళీ నాయక్, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డిలు బీఆర్ఎస్, బీజేపీలపై దుమ్మెత్తిపోశారు. యూరియా విషయంలో కావాలనే కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ బద్నాం చేస్తోందన్నారు. యాత్రలో వేం నరేందర్ రెడ్డి, కొండా మురళీ, జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి ఈ యాత్రకు హాజరుకాకపోవడంపై కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది. పార్టీ ఫిరాయించారంటూ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులిచ్చిన వారిలో ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందుకే దూరంగా ఉండొచ్చనే గుసగుసలు వినిపించాయి.

పాదయాత్రకు తరలొచ్చిన శ్రేణులు..

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రెండో విడత జనహిత పాదయాత్రకు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావడంతో వర్ధన్నపేట మండలంలో కోలాహలం కనిపించింది. కాంగ్రెస్ నేతలు రాత్రి ఏడు గంటల ఐదు నిమిషాలకు ఇల్లంద చేరుకోగా ఆటపాటలతో కళాకారులు, బోనాలతో మహిళలు ఘనస్వాగతం పలికారు. వీరిరాకకు ముందే ఇల్లందలో కాంగ్రెస్ పార్టీ జెండాను జిల్లా పార్టీ అధ్యక్షురాలు స్వర్ణ ఆవిష్కరించారు. అనంతరం 7.05 గంటలకు భారీ సంఖ్య లో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి నేతలు దాదాపు మూడు కిలోమీటర్లు మేర పాదయాత్ర సాగించారు. సుమారు 8.24 గంటలకు వర్ధన్నపేట టౌన్‌లోని అంబేడ్కర్ సర్కిల్ చేరుకున్నారు.

తప్పని తిప్పలు...

● ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు జనహిత పాదయాత్ర ఉండడంతో పోలీసులు ట్రాఫిక్‌ని కట్రియాల నుంచి కొత్తపల్లి రోడ్డుకి డైవర్ట్ చేయగా భారీ ట్రాఫిక్ జామైంది. అంబులెన్స్ వాహనం కూడా ఆ ట్రాఫిక్‌లో చిక్కుకుంది.

● పాదయాత్ర జరిగే జాతీయ రహదారిలో గుంతలు పూడ్చకపోవడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు. కొందరు అదుపుతప్పి కిందపడ్డారు.



పాదయాత్రకు హాజరైన ప్రజలు

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

● భర్త మృతిపై అనుమానంతో పోలీసులకు భార్య ఫిర్యాదు
● ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం



పోస్టుమార్టం వివరాలు నమోదు చేస్తున్న వైద్యులు

మల్హర్: భర్త మృతిపై భార్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పూడ్చిన మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన వెల్పుల వెంకటి(46) ఈ నెల 17వ తేదీన మృతిచెందాడు. 18న కుటుంబ సభ్యులు వెంకటి మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. వెంకటి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గ్రామంలో పనికి వెళ్లిన చోట వెంకటి విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గ్రామంలో ప్రచారం జరిగింది. అయితే తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య రాజేశ్వరి కొయ్యూరు పీఎస్‌లో ఈనెల 21న ఫిర్యాదు చేయగా తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని బయటకు తీసి వరంగల్ కేఎంసీ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మహిళను అవమానించిన నేరస్తుడికి జైలు, జరిమానా

వరంగల్ లీగల్ : అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించమని అడిగినందుకు మహిళపై అకారణంగా దాడి చేసి అవమానించిన ఘటనలో నేరం రుజువుకావడంతో కాజీపేట మండలం మడికొండకు చెందిన నేరస్తుడు ఎం.డి. యాకూబ్ పాషాకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి శ్రావణ స్వాతి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బోడగుట్టలో నివసిస్తున్న చుంచు పున్నయ్య, భారతమ్మ దంపతులతో యాకూబ్‌పాషా కుటుంబానికి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన వ్యాపార అవసరాల నిమిత్తం యాకూబ్ పాషా 2013, జూన్ 02న పున్నయ్య నుంచి రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించమని అడిగిన ప్రతీసారి ఏదో ఒక కారణంతో వాయిదా వేస్తున్నాడు. దీంతో 2014, అక్టోబర్ 09న భారతమ్మ.. యాకూబ్ పాషా ఇంటికెళ్లి అప్పు వడ్డీతో సహా చెల్లించాలని అడిగింది. దీంతో కోపోద్రిక్తుడైన యాకూబ్ పాషా భారతమ్మను దుర్భాషలాడుతూ మరోసారి తన ఇంటికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. అంతటితో ఆగకుండా మహిళ అనే విచక్షణ లేకుండా జుట్టు పట్టి లాక్కెళ్లి నెట్టివేశాడు. ఈ ఘటనపై భారతమ్మ మడికొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు యాకూబ్ పాషాకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి శ్రావణ స్వాతి తీర్పు వెలువరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

MEDICAL TRANSCIPTION
■ MLT, MPHW(F) చదివిన విద్యార్థులకు DMLT, DMSTలో చదువు + ప్రాక్టికల్ + ఉద్యోగం కలదు. సెల్: 9177631014, 9849819819.
[SCA25007614]

REAL ESTATE

TO-LET
■ 3-BHK, GopiKrishna Residency Flat No.506, H.No.5-9-11, Flat Rent. Kishanpura, Hanamkonda. Cell: 9959389999, 9390105601.
[WA-6763]

WANTED
■ క్రిస్టల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ L.B నగర్ వరంగల్ యందు పనిచేయుటకు సూపర్‌వైజర్ కావలెను. అర్హత: 10th క్లాస్, జీతం నెలకు 7 వేలు. సంప్ర॥ 9966493673, 9849827928.
[SCA25007599]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.